సాక్షి
పార్వతీపురం మన్యం
గురువారం । 15 । మే । 2025



నిధుల జాడెక్కడ..?
- 8లో

కూటమి ప్రభుత్వం ప్రజాసంక్షేమాన్నే కాదు ప్రజారోగ్యాన్ని పక్కన పెట్టేసింది. ఆస్పత్రులకు నదుపాయాల కల్పనపై కినుక వహిస్తోంది.



ఈశ్వరమ్మ కంటకన్నీరు

సాలూరుమహిళా మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మపై టీడీపీ పట్టణాధ్యక్షుడు నిమ్మాది చిట్టి అనుచిత వ్యాఖ్యలు చేసి కన్నీరు తెప్పించాడు.
- 8లో

వెబ్‌సైట్‌లో మెరిట్ జాబితా

విజయనగరం ఫోర్ట్: జిల్లా ఆస్పత్రుల సేవల సమన్వయాధికారి పరిధిలో 29 ఉద్యోగాలకు సంబంధించి ఫైనల్ మెరిట్ జాబితాను విజయనగరం.ఏపీ.జీఓవీ.ఇన్‌లో పొందుపరిచినట్టు జిల్లా ఆస్పత్రుల సేవల సమన్వయధికారి(డీసీహెచ్ఎస్) డాక్టర్ ఎన్.పి.పద్మశ్రీరాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖాళీల భర్తీ పూర్తి పారదర్శకంగా, అవినీతికి తావు లేకుండా చేపట్టామన్నారు.

న్యూస్‌రీల్

నిబద్ధతతో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర

పార్వతీపురం టౌన్: జిల్లాలో ఈ నెల 17న చేపట్టనున్న స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిబద్ధతతో చేపట్టాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులకు ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రలో జిల్లాను ముందంజలో నిలపాలని సూచించారు. జిల్లాలో 80 పంచాయతీ భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్టు వెల్లడించారు. 248 మలేరియా ప్రభావిత గ్రామాలుగా గుర్తించి 50 వేల మందికి రక్త పరీక్షలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో డీఆర్వో హేమలత, డీపీఓ పి.వీరరాజు, డీఎంహెచ్ఓ ఎస్.భాస్కరరావు, వివిధశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పోక్సో కేసు నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష

- రూ.వెయ్యి జరిమానా
- పోక్సోకోర్టు తీర్పును వెల్లడించిన ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: జిల్లాలో మూడేళ్ల కిందట నమోదైన పోక్సో కేసులో 72 ఏళ్ల వృద్ధుడు కింతాడ అంజిబాబుకు మూడేళ్ల జైలు శిక్ష, రూ. 1000 జరిమానా విధిస్తూ మహిళా, పోక్సో కోర్టు జడ్జి నాగమణి తీర్పు ఇచ్చినట్టు ఎస్పీ వకుల్ జిందల్ బుధవారం తెలిపారు. 2023లో ఇంటి మేడపై ఆడుకుంటున్న ఆరేళ్ల బాలికను అంజిబాబు లైంగికంగా వేధించినట్టు చిన్నారి తల్లి అప్పటి దిశ మహిళ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ లక్ష్మి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కోర్టుకు అభియోగపత్రాలు దాఖలు చేశారు. మహిళా స్టేషన్ డీఎస్పీ గోవిందరావు సాక్షులను కోర్టులో ప్రవేశ పెట్టారు. నేరం నిరూపణ కావడంతో జడ్జి నాగమణి తీర్పు వెలువరించినట్టు ఎస్పీ తెలిపారు.

పోలిపల్లి పైడితల్లి హుండీల ఆదాయం రూ.3.24 లక్షలు



హుండీల ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది, భక్తులు

రాజాం సిటీ: బొబ్బిలి రోడ్డులోని పోలిపల్లి పైడితల్లి అమ్మవారి హుండీల ఆదాయం బుధవారం లెక్కించారు. రెండు నెలలకు గాను రూ.3,24,800లు ఆదాయం వచ్చినట్టు ఈఓ బీవీ మాధవరావు తెలిపారు. కార్యక్రమంలో చీపురుపల్లి కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయ ఈఓ. శ్రీనివాసరావు, ఆలయ ధర్మకర్త వాకచర్ల దుర్గాప్రసాద్, సిబ్బంది, పర్యవేక్షకులు పాల్గొన్నారు.

కియోస్కలపై కూటమి నిర్లక్ష్యం

విజయనగరం ఫోర్ట్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి సచివాలయంలో రైతులకు సేవలందించిన కియోస్క్ యంత్రాలపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, యంత్రాల కోసం ఇండెంట్ పెట్టేందుకు ఉపయోగపడే యంత్రాలు ఇప్పుడు వినియోగం లేక మూలకు చేరుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా రైతుసేవా కేంద్రాల్లో ఉన్న 505 కియోస్క్ యంత్రాల్లో 125 మరమ్మతులకు గురైనా పట్టించుకునేవారే కరువయ్యారు. ఇదే విషయాన్ని జిల్లా వ్యవసాయాధికారి వి.తారకరామారావు వద్ద ప్రస్తావించగా రైతు సేవా కేంద్రాల్లో పాడైన కియోస్కల విషయాన్ని ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. బాగుచేయించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఉష్ణతాపం నుంచి ఉపశమనం కల్పిద్దాం



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: వేసవిని దృష్టిలో ఉంచుకొని ఈ నెల 17వ తేదీ మూడో శనివారం నిర్వహించే స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఉష్ణతాపం నుంచి ప్రజలకు ఉపశమనం కలిగించే చర్యలు చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మండల, జిల్లా అధికారులను ఆదేశించారు. వచ్చేనెల రోజుల పాటు వడగాల్పులు వీచే అవకాశం ఉన్నందున జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలు, పట్టణాల్లో వేసవి నుంచి ఉపశమనం కలిగించే చర్యలు చేపట్టాలన్నారు. ఈ నెల మూడో శనివారం 'బీట్ ద హీట్' పేరుతో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించాలన్నారు. జన సమూహాలు ఉండే ప్రదేశాల్లో తాగునీటి సదుపాయం కల్పించాలని సూచించారు. సమావేశంలో డీఆర్వో ఎస్.శ్రీనివాసమూర్తి, సీపీఓ పి.బాలాజీ, జెడ్పీ సీఈఓ బి.వి.సత్యనారాయణ, పంచాయతీ అధికారి టి.వెంకటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ పి.నల్లనయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



గుమ్మలక్ష్మీపురంలో కురుస్తున్న వర్షం



పాలకొండ రూరల్: పాలకొండలో కురుస్తున్న భారీ వర్షం



భామిని: బిల్లుమడలో ధాన్యం రాశుల చుట్టూ చేరిన వర్షపునీరు

ఏజెన్సీలో గాలివాన

పార్వతీపురం మన్యం జిల్లాలోని పాలకొండ, గుమ్మలక్ష్మీపురం, సీతంపేట, భామిని తదితర మండలాల్లో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులతో కూడిన వర్షానికి చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. లోతట్టు ప్రాంతాలను వర్షం నీరు ముంచెత్తింది. భామినిలోని పలు గ్రామాల్లో నూర్పిడి చేసిన రబీ వరి ధాన్యం తడిసిముద్దయ్యాయి. మామిడి, జీడిమామిడి పంటలకు అపార నష్టం వాటిల్లడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. పంట నష్టపోయినా పట్టించుకునేవారే కరువయ్యారంటూ వాపోతున్నారు.

– గుమ్మలక్ష్మీపురం/పాలకొండరూరల్/భామిని/సీతంపేట



ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద రోడ్డుపై వాహనాలకు అడ్డంగా ఉన్న పశువులు

పశువుల పురం..!

- ప్రధాన రహదారులే పశువులకు ఆవాసాలు
- పాలు పిండుకుని రోడ్లపై వదిలేస్తున్న యజమానులు
- రోజంతా రహదారిపై పశువుల తిష్ఠ
- రాకపోకలకు అవస్థలు పడుతున్న వాహనదారులు

పార్వతీపురం రూరల్:

పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలోని రోడ్లు పశువులపరమయ్యాయి. ప్రధాన రహదారి పశువులకు ఆవాసంగా మారింది. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి పాత బస్టాండ్ వరకు ఉన్న రోడ్డుపై రాత్రీపగలు పశువులు సంచరిస్తున్నాయి. అంతర్ రాష్ట్ర రహదారిపై రాకపోకలు సాగించే వాహనాలకు అడ్డంకిగా మారాయి. పశువుల యజమానులు పాలు పిండుకుని వదిలేస్తుండడంతో పశువులు రోడ్లపై చేరుతున్నాయి. వ్యర్థాలను తింటూ సంచరిస్తున్నాయి. తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. సమస్యను పరిష్కరించాల్సిన మున్సిపల్, పోలీస్ అధికారులు చోద్యం చూస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



పాత బస్టాండ్ సమీపంలో రోడ్డుపై తిష్ఠ వేసిన గోవులు



వరహాల గెడ్డ వంతెన వద్ద ఇలా..

నోటీసులు ఇస్తాం



రహదారిపై సంచరిస్తున్న పశువులకు సంబంధించి ఫిర్యాదులు అందాయి. వాటికి సంబంధించిన యజమానులకు మున్సిపల్ కార్యాలయం నుంచి నోటీసులు ఇవ్వనున్నాం. అప్పటికీ వారి నుంచి స్పందన లేకపోతే గోవుల సంరక్షణ కేంద్రాలకు తరలిస్తాం.

– సీహెచ్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ పార్వతీపురం

యజమానులే బాధ్యత వహించాలి



ఇష్టానుసారం పశువులను వాటి సంరక్షకులు విడిచి పెట్టడంతో అవి రోడ్లపై సంచరిస్తూ ట్రాఫిక్ సమస్యకు కారణం అవుతున్నాయి. యజమానులే బాధ్యత వహించి వాటి సంరక్షణ చూసుకోవాలి. రోడ్లపై విడిచిపెట్టే పశువుల యజమానులకు పోలీస్‌శాఖ తరపున సమాచారం ఇచ్చి రోడ్లపైనే విడిచి పెట్టకుండా సూచిస్తున్నాం. అప్పటికీ స్పందించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకోనున్నాం.

-కె.మురళీధర్, పార్వతీపురం సీఐ

రోడ్లపై వదిలేస్తున్నారు



పశువులను రోడ్లపైనే వదిలి వేయడంతో అవి రోడ్లపై అడ్డంగా తిష్ఠ వేస్తున్నాయి. ఈ కారణంగా పట్టణంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. దీనికి తోడు వాటికి సరైన మేత లేక సమీపంలో ఉన్న వ్యర్థాలను, చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలను తింటున్నాయి. పశువుల పోషణ సంరక్షణ యజమానులే బాధ్యతగా తీసుకోవాలి. వీధుల్లోకి రహదారుల పైకి యజమానులు ఈ విధంగా విడిచిపెట్టడం సరికాదు. యజమానులకు కుదరకపోతే వాటిని సంబంధించిన అధికారులు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న రైతులకు అప్పగించాలి.

-వంగల దాలినాయుడు, జాతీయ మానవహక్కుల కమిటీ జిల్లా అధ్యక్షుడు

పాలిసెట్‌లో ప్రతిభ

- విజయనగరంలో 95.36 శాతం, మన్యంలో 93.96 శాతం మంది ఉత్తీర్ణత



ఉప్పు లాస్య మాధురి (116/120)



పల్లా హేమశ్రీ (112/120)



పెద్దపోలు తేజా (106/120)

విజయనగరం అర్బన్: పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షలో ఉమ్మడి విజయనగరం జిల్లా విద్యార్థులు ప్రతిభ చూపారు. అధికమంది ఉత్తీర్ణత సాధించారు. పరీక్ష రాసిన 8,097 మందిలో 7,705 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో విజయనగరం జిల్లాలో 6,938 మందిలో 95.36 శాతంతో 6,616 మంది, పార్వతీపురం మన్యంలో 1,159 మందిలో 93.96 శాతంతో 1,089 మంది ఉత్తీర్ణలయ్యారు. విజయనగరం జిల్లాలో బాలికలు 97.44 శాతం, బాలురు 93.9 శాతం, మన్యంలో బాలికలు 96.59 శాతం, బాలురు 92.35 శాతం పాసయ్యారు. 117 మార్కులు సాధించిన షేట్ అబ్దుల్ ముజీర్, చిల్లా పూర్ణ సంజయ్, మండల వాగ్దేవిలు విజయనగరం జిల్లా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థాయి ర్యాంకర్లుగా నమోదయ్యారు. పార్వతీపురం మన్యం జిల్లాలో అత్యధికంగా 113 మార్కులతో పప్పల చక్రి (ప్రథమ), 112 మార్కులతో పొడుగు యోగిభద్రినాథ్ (ద్వితీయ), 111 మార్కులతో ఇప్పిలి వెంకటరమణ తృతీయ స్థానంలో నిలచారు.

వంద మార్కులు పైబడి..

పాలిసెట్‌లో 120కు 100 మార్కుల పైబడి అధిక మంది విద్యార్థులు సాధించారు. వెయ్యిలోపు ర్యాంకులు తెచ్చుకున్నారు. ఉప్పు లాస్య మాధురి (116/120), ఎల్.భాషిణి (114/120), పూసపాటిరేగ మండలం కొప్పెర్లకు చెందిన పల్లా హేమశ్రీ (112/120), మత్స వెంకటలక్ష్మి (111/120), బి.జ్యోత్స్న (110/120), గరివిడి మండలం ఆర్తమూరుకు చెందిన పెద్దపోలు తేజా (106/120) ఉన్నారు.

దక్షిణ భారతదేశ యాత్రకు ఐఆర్ సీటీసీ ఏర్పాట్లు



పార్వతీపురం టౌన్: ఐఆర్ సీటీసీ ఆధ్వర్యంలో దక్షిణ భారతదేశ యాత్రకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్టు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ నుంచి 'భారత్ గౌరవ్' పేరుతో ప్రత్యేక రైలును ఏర్పాటు చేసిందన్నారు.

ప్యాకేజీ వివరాలు ఇలా...

అరుణాచలం-మధురై రామేశ్వరం యాత్ర: ఈ నెల 22 నుంచి 30వ తేదీ వరకు 8 రాత్రులు, 9 పగలు ప్రయాణంలో అరుణాచలం, రామేశ్వరం, మధురై, కన్యాకుమారి, త్రివేండ్రం, తిరుచ్చి, తంజావూరులలో ఉన్న పుణ్యక్షేత్రాల దర్శనం కల్పిస్తారు. దీనికోసం ఒక్కో పర్యాటకుడు రూ.14,700 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది.

హరిద్వార్-రిషికేశ్ వైష్ణోదేవి యాత్ర: జూన్ 3 నుంచి 12వ తేదీ వరకు 9 రాత్రులు, 10 పగలు ప్రయాణంలో హరిద్వార్, రిషికేశ్, ఆనందపూర్, నైనా దేవి ఆలయం, అమృతసర్, మాతా వైష్ణోదేవి ఆలయాల సందర్శన ఉంటుంది. దీని కోసం రూ.18,510 చెల్లించాలి.

కాశీ-అయోధ్య-ప్రయాగరాజ్ యాత్ర: జూన్ 14 నుంచి 22వ తేదీ వరకు 8 రాత్రులు, 9 పగలతో కూడిన కాశీ, అయోధ్య, నైమిశారణ్య, ప్రయాగ్ రాజ్, శ్రీంగవేరపురం ఆలయాలను దర్శించుకునే అవకాశం ఉంటుంది. దీని కోసం టికెట్ ధర రూ.16,200.

ఉజ్జయిని, త్రయంబకేశ్వర్-భీమశంకర్ ఘృష్ణేశ్వర్: జూలై 5 నుంచి 23వ తేదీ వరకు 8 రాత్రులు, 9 పగలు ప్రయాణంలో మహాకాళేశ్వర్, ఓంకారేశ్వర్, త్రయంబకేశ్వర్, భీంశంకర్, ఘృష్ణేశ్వర్, ఎల్లోరా, మోవ్, నాగ్పూర్‌తో యాత్ర కోసం పర్యాటకులు రూ:14,700 వరకు చెల్లించాలి. దక్షిణ భారతదేశ యాత్రలో రైలు, బస్సు, హోటల్ ఐఆర్ సీటీసీ ఏర్పాటు చేస్తుంది. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం, మంచి నీళ్ల బాటిల్స్, పర్యాటకుల ఆలయాల సందర్శన సమయంలో గైడ్ సేవలను ఐఆర్ సీటీసీ ఏర్పాటు చేస్తుంది. ఎటువంటి అదనపు ఖర్చు లేకుండా ప్రయాణికులకు ప్రయాణ సమయంలో బీమా సౌకర్యాన్ని కల్పిస్తుంది. పూర్తి వివరాలకు 040-27702407, 97013 60701, 92814 95845, 92814 95843, 92810 30712, 92810 30740 నంబర్లను సంప్రదించాలని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

శ్యామలాంబ జాతరను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

- అధికారులను ఆదేశించిన కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం టౌన్: సాలూరులో ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు జరగనున్న శ్యామలాంబ అమ్మవారి జాతరను విజయవంతం చేసేందుకు అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ స్పష్టం చేశారు. జాతర నిర్వహణపై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో బుధవారం మాట్లాడారు. 15 ఏళ్ల తరువాత జరుగుతున్న అమ్మవారి జాతరకు భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యే అవకాశం ఉందన్నారు. జాతర జరిగే మూడు రోజులూ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జాతరకు విచ్చేసే భక్తులకు తాగునీరు, మరుగుదొడ్లు, ఇతర మౌలిక వసతుల కల్పన ఏర్పాట్లు పక్కాగా ఉండాలన్నారు.

- జాతర జరిగే నాలుగు రోజుల్లో నాలుగు జిల్లాలకు చెందిన 1240 బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు కలెక్టర్‌కు వివరించారు.
- సిరిమాను తిరిగే ప్రాంతాలతో పాటు అన్ని ముఖ్య ప్రాంతాల్లో గట్టి పోలీసు బందోబస్తుతో పాటు 30 రోప్ పార్టీలను సంసిద్ధం చేయాలని పోలీస్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. భక్తులందరూ ఒకే ప్రాంతంలో గుమిగూడకుండా తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. సాలూరు పట్టణ రహదారుల్లో గుర్తించిన 22 పాట్ హోల్స్‌ను తక్షణమే పూడ్చివేయాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు.
- విద్యుత్ లోఓల్టేజీ సమస్య తలెత్తకుండా అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుచేశామని, సిరిమాను తిరిగే సమయంలో విద్యుత్‌ను నిలిపివేస్తున్నామని, ఆ సమయంలో విద్యుత్‌కు అంతరాయం కలగకుండా కమిటీ సహకారంతో జనరేటర్లను ఏర్పాటుచేయనున్నట్లు ఎస్ఈ కలెక్టర్‌కు వివరించారు.
- 14 వైద్య బృందాల ద్వారా 378 మంది వైద్య సిబ్బంది జాతర ముగిసే వరకు నిత్యం సేవలు అందించాలని, అంబులెన్సులు, మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. దేవాలయానికి అలంకరణ, క్యూలైన్లు, భక్తులకు, చిన్నారులకు తాగునీరు, పాలు, మజ్జిగ వంటి ఏర్పాట్లతో పాటు మరుగుదొడ్ల సదుపాయం కల్పించాలని ఆలయ ఈఓను ఆదేశించారు. అధికారులందరూ వారికి అప్పగించిన విధులను బాధ్యతగా నిర్వర్తించి జాతరను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జేసీ ఎస్.ఎస్.శోభిక, ఎస్డీసీ డా.పి.ధర్మ చంద్రారెడ్డి, ఆలయ ఈఓ టి.రమేష్, మండల ప్రత్యేక అధికారి శివన్నరాయణ, మున్సిపల్ కమిషనర్ డి.టి.వి.కృష్ణారావు, మండల తహసీల్దార్ ఎస్.వి.రమణ, ఎంపీడీఓ జి.పార్వతి, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ కె.చలపతిరావు, డీపీఓ టి.కొండలరావు, జిల్లా ఎక్సైజ్ అధికారి ఎం.రవిప్రసాద్, జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి బి.చంద్రశేఖర్, జిల్లా విపత్తు ల స్పందన అధికారి కె.శ్రీనుబాబు, డీఎంహెచ్ఓ ఎస్.భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి అక్రమ రవాణాను అడ్డుకోవాలి



జిల్లా పోలీస్ కార్యాలయంలో మాసాంతర నేర సమీక్షలో సిబ్బందికి దిశానిర్దేశం చేస్తున్న ఎస్పీ వకుల్ జిందల్, ఏఎస్పీ సౌమ్యలత

విజయనగరం క్రైమ్: జిల్లాలో గిరిజన, మైదాన ప్రాంతాల పోలీస్‌స్టేషన్లలో నమోదైన గంజాయి కేసులను పరిశోధించాలి.. మూలాలను వెలికితీసి గంజాయి రవాణాకు అడ్డుకట్ట వేయాలని ఎస్పీ వకుల్‌జిందల్ ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం జరిగిన మాసాంతర నేర సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గంజాయి రవాణా జరగకుండా కొత్తగా ఏర్పాటుచేసిన నాలుగు చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా నెల రోజుల్లో నమోదైన కేసుల పురోగతిపై సమీక్షించారు. శక్తి యాప్ ఫిర్యాదులు 112, బీఎన్ఎస్, ఎస్టీ, ఎస్సీ, పోక్సో, ఎన్డీపీఎస్, మిస్సింగ్, మహిళలపై జరుగుతున్న దాడులకు సంబంధించిన కేసుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ రాత్రి 11 గంటల తర్వాత అకారణంగా ఎవరైనా రోడ్ల మీద తిరిగితే కేసులు నమోదు చేయాలన్నారు. హిస్టరీ షీట్ల వివరాలను సీసీటీఎన్ఎస్ పోర్టల్‌లో నిక్షిప్తం చేయాలన్నారు. వేసవి కాలంలో దొంగతనాలు జరగకుండా నిఘా పెంచాలని సూచించారు.

అప్రమత్తతే ఆయుధం



మాక్ డ్రిల్‌ను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్వో హేమలత

- విపత్కర పరిస్థితులను ఎదుర్కోవడంపై సన్నద్ధత
- మాక్ డ్రిల్‌ను పరిశీలించిన కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురంటౌన్/పార్వతీపురం రూరల్: అప్రమత్తత అనే ఆయుధం ఎలాంటి విపత్కర పరిస్థితుల నుంచి అయినా రక్షిస్తుందని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. కేంద్ర, రాష్ట్ర మార్గదర్శకాలకు అనుగుణంగా విపత్కర పరిస్థితుల సన్నద్ధతపై బుధవారం పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో మాక్ డ్రిల్ నిర్వహించారు. అనుకోని రీతిలో ఉగ్రదాడులు, బాంబుపేలుళ్లు, అగ్ని ప్రమాదాల సమయంలో రక్షించుకునే మార్గాలను పార్వతీపురం ఆర్టీసీ కాంపెక్స్ వేదికగా అగ్నిమాపక, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, పోలీస్, వైద్య సిబ్బంది ప్రయోగాత్మకంగా వివరించారు. బాంబుల దాడి సమయంలో చెవులు మూసుకుని పడుకోవడం, ఇళ్లలో చిక్కుకున్న వారిని రెస్క్యూ బృందాలు రక్షించడం, గాయాలపాలైన వారికి తక్షణ వైద్యసేవలు అందించడం, మరికొందరిని అంబులెన్సులో ఆస్పత్రికి తరలించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. మాక్ డ్రిల్‌ను కలెక్టర్‌తో పాటు ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాత్సవ, డీఆర్వో కె.హేమలత, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ పి.ధర్మచంద్రా రెడ్డి, డీఎంహెచ్ఓ భాస్కరరావు, టి.జగన్‌మోహన్‌రావు, జిల్లా అగ్నిమాపక అధికారి కె.శ్రీనుబాబు, ఏపీ ఎస్డీఆర్ఎఫ్ ఎస్ఐ రఘు, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ కె.చలపతిరావు, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ ఐ.రాజేశ్వరి, ఎంవీఐఎం శశికుమార్ పర్యవేక్షించారు.



గాయపడిన వ్యక్తిని తరలిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ బృందం

క్లుప్తంగా

వెటర్నరీ కళాశాలలో వీసీఐ బృందం పర్యవేక్షణ



కళాశాలలో భవన సముదాయాలు, సౌకర్యాలపై వివరాలను తెలుసుకుంటున్న బృందం సభ్యులు

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడిలోని శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ కళాశాలలో వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(వీసీఐ) బృందం సభ్యులు బుధవారం పర్యవేక్షించారు. గుజరాత్ రాష్ట్రంలోని కామధేను యూనివర్సిటీ నుంచి అసోసియేట్ ప్రొఫెసర్ డా.పి.యమ్.లునగారియా, ఒడిశా వెటర్నరీ కళాశాల నుంచి అసోసియేట్ ప్రొఫెసర్ డా.అంబికాప్రసాద్ కె.మహాపాత్ర, మహారాష్ట్ర వెటర్నరీ కళాశాల నుంచి డా.ప్రతిభా జండేతో కూడిన బృందం కళాశాలను సందర్శించింది. ఈ సందర్శనలో భాగంగా కళాశాలలో నిర్మించిన భవన సముదాయాన్ని బృందంసభ్యులు పర్యవేక్షించారు. విద్యార్థులకు సరిపడా తరగతి భవనాలు సక్రమంగా అందుబాటులో ఉన్నదీ లేనిదీ క్షుణ్ణంగా తనిఖీ చేశారు.ఈ భవనాల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల మౌలిక వసతులు సక్రమంగా ఉన్నదీ లేనిదీ పరిశీలించారు. కళాశాలలో మరో రెండు రోజుల పాటు పర్యవేక్షణ చేయనున్నారు. పర్యవేక్షణలో కళాశాల అసోసియేట్ డీన్ మక్కేన శ్రీను పాల్గొన్నారు.

డీఈఓకు ఎస్టీయూ జిల్లా కమిటీ వినతి



వినతిపత్రాన్ని అందుకుంటున్న డీఈఓ మాణిక్యం నాయుడు

విజయనగరం అర్బన్: ప్రభుత్వం తాజాగా ప్రకటించిన టీచర్ల బదిలీ ప్రక్రియలోని అసంబద్ధ నిబంధనలను సడలించాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం ప్రతినిధులు బుధవారం డీఈఓ యూ.మాణిక్యంనాయుడిని కలిసి వినతిపత్రం అందజేశారు. 2021, 2023వ సంవత్సరంలో రేషనలైజేషన్‌కు గురైన పీఎస్‌హెచ్‌ఎంలకు 2021వ సంవత్సరం ముందు పనిచేసిన 'ఓల్డ్ స్టేషన్ పాయింట్'ను మంజూరు చేయాలని కోరారు. గత నెల 24, 25, 26 తేదీన వైద్య ధ్రువీకరణ పత్రాలను పొందేందుకు హాజరుకాలేకపోయిన ఉపాధ్యాయులకు మరో అవకాశం ఇవ్వాలని కోరారు. టిస్‌లో ఉన్న తప్పుల సవరణకు ఎంఈఓలకు అవకాశం కల్పించాలని సూచించారు. ప్రిఫరెన్స్ కేటగిరి ఉన్న ఉపాధ్యాయులకు వారికి ఇష్టమైన మోడల్ ప్రైమరీ పాఠశాలలకు వెళ్లే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. మోడల్ ప్రైమరీ పాఠశాలల హెచ్‌ఎంగా ఎస్‌జీటీలకు పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. డీఈఓను కలిసిన వారిలో సంఘం జిల్లా అధ్యక్షుడు కె.జోగారావు, ప్రధాన కార్యదర్శి చిప్పాడ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

శుభం చిత్రయూనిట్ సందడి



హిమగిరి థియేటర్‌లో శుభం చిత్రయూనిట్ సందడి

విజయనగరం టౌన్: ప్రముఖ హీరోయిన్ సమంత నిర్మించిన శుభం చిత్రయూనిట్ విజయనగరంలో బుధవారం సందడి చేసింది. ఈ మేరకు స్థానిక సప్తగిరి మల్టీప్లెక్స్‌లో సెకెండ్ షోలో ప్రేక్షకులను సినీ హీరోలు, హీరోయిన్లు షాలిని, షరియా, హర్షిత్, చరణ్, శార్వాణి, శ్రీనివాస్‌లు అలరించారు. దర్శకుడు కె.ప్రవీణ్, హాస్యనటుడు వంశీ ఇతర నటులు సందడి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విజయనగరం రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. జిల్లావాసుల ఆదరణ ఎనలేనిదన్నారు. తమ చిత్రాన్ని విజయవంతం చేసినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సమంత తన సొంత నిర్మాణ సంస్థ ఏర్పాటు చేసి తమలాంటి వారికి అవకాశమిచ్చి బాగా ప్రోత్సహించారన్నారు. సినిమా మొత్తం ఫ్యామిలీ ఆడియన్స్‌ను దృష్టిలో పెట్టుకుని తీశారన్నారు. ఫ్యామిలీస్ బాగా ఎంజాయ్ చేస్తున్నారని చెప్పడం మర్చిపోలేని అనుభూతి ఇచ్చిందన్నారు. త్వరలోనే మరిన్ని చిత్రాల ద్వారా ప్రేక్షకులను ఆకట్టుకుంటామన్నారు. కార్యక్రమంలో థియేటర్ మేనేజర్ నాయుడు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹125	₹220	₹230

నిధుల జాడెక్కడ.?

- ఏడాదిగా ఏరియా ఆస్పత్రికి తప్పనికష్టాలు
- గత ప్రభుత్వంలో రూ.28 కోట్లు మంజూరు



చీపురుపల్లి ఏరియా ఆస్పత్రి

చీపురుపల్లి: కూటమి ప్రభుత్వం ఏర్పడేందుకు ఎన్నికలు జరిగి సరిగ్గా ఏడాదైంది. ప్రజలంతా ఓట్లు వేయగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఇదంతా జరిగి ఏడాది కావస్తున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో ఏదైనా అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన జరిగిందా? అంటే శూన్యమనే చెప్పుకోవాలి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలో గ్రామీణ ప్రాంతాల్లో విద్య, వైద్యం పడకేశాయనే చర్చ విస్తృతంగా జరుగుతోంది. దీనికి నియోజకవర్గ కేంద్రమైన చీపురుపల్లిలో గల ఏరియా ఆస్పత్రి ప్రధాన ఉదాహరణగా నిలుస్తుంది. ఎన్నికల ముందు గత ప్రభుత్వ హయాంలో యాభై పడకల ఆస్పత్రి నుంచి వంద పడకల ఆస్పత్రిగా ఏరియా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ అయినప్పటికీ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నప్పటికీ అప్పుడెలా ఉందో ఇప్పుడూ అలాగే ఉందని పలువురు చర్చించుకుంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వ వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ (సీహెచ్‌సీ)లను ఏరియా ఆస్పత్రులుగా అప్‌గ్రేడ్ చేయడమే కాకుండా ప్రతి సచివాలయం పరిధిలో విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేశారు. దీంతో పట్టణంతో పాటు పల్లెల్లోనూ పేదలకు ఆరోగ్య సేవలు విరివిగా అందేవి. కానీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రభుత్వ వైద్య వ్యవస్థపై కనీసం దృష్టి సారించకుండా నిర్వీర్యం చేసిందని పలువురు విమర్శిస్తున్నారు.

ఎమ్మెల్యే దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా..

పట్టణంలోని ఏరియా ఆస్పత్రికి మంజూరు కావాలిసిన నిధుల విషయాన్ని ఇప్పటికే పలుమార్లు స్థానిక ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు దృష్టికి ఆస్పత్రి వర్గాలు తీసుకువెళ్లాయి, ఆరు నెలల క్రితం మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే కళా వెంకటరావు నేతృత్వంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలోనూ, ఇటీవల రెండు నెలల క్రితం ఏరియా ఆస్పత్రిలో జరిగిన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలోనూ ఇదే అంశాన్ని ప్రధానంగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయిస్తానని చెప్పారు. కానీ ఇంతవరకు ఎలాంటి పురోగతి లేకపోవడం శోచనీయం.

గత ప్రభుత్వంలో రూ.28 కోట్ల నిధులు

ఇదిలా ఉండగా యాభై పడకల సీహెచ్‌సీగా ఉన్న స్థానిక ఆస్పత్రిని గత ప్రభుత్వంలో వంద పడకల ఏరియా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేశారు. దీనికోసం వైద్యులు, స్టాఫ్‌నర్సులు, సిబ్బంది పోస్టులతో బాటు మౌలిక వసతుల కల్పన కోసం రూ.28 కోట్లు మంజూరు చేశారు. ఆ నిధులతో వంద పడకల ఆస్పత్రి అభివృద్ధి కోసం అప్పటి మంత్రి బొత్స సత్యనారాయణ శంకుస్థాపన కూడా చేశారు. ఇంతలో ఎన్నికలు రావడంతో పనులు ప్రారంభం కాలేదు.

కూటమి ప్రభుత్వం కినుక..

వంద పడకల ఏరియా ఆస్పత్రి మౌలిక వసతుల కల్పన కోసం మంజూరైన నిధులకు సంబంధించి జీవో ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా ఇంతవరకు నిధుల విడుదలలో పురోగతి కనిపించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. దీని పుణ్యమాని స్థానిక ఏరియా ఆస్పత్రి పేరుకే వంద పడకల ఆస్పత్రి అయినప్పటికీ ఉన్నవి మాత్రం యాభై పడకలు మాత్రమేనని పలువురు చర్చించుకుంటున్నారు. నిరంతరం వందల సంఖ్యలో రోగుల తాకిడి ఉండే స్థానిక ఏరియా ఆస్పత్రికి నిధులు మంజూరు చేసి మౌలిక వసతులు కల్పించాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందని పలువురు కోరుతున్నారు.

ఇంకా నిధులు రాలేదు....

ఏరియా ఆస్పత్రిలో వంద పడకలతో పాటు ఇతర మౌలిక వసతుల కల్పన కోసం నిధులు రావాల్సి ఉంది. ఏరియా ఆస్పత్రిలో భాగంగా వైద్యులు పోస్టులు నిండాయని ఇంకా స్టాఫ్ నర్సుల పోస్టులు రావాల్సి ఉంది. తాజాగా కౌన్సెలింగ్ జరుగుతున్న నేపథ్యంలో స్టాఫ్‌నర్సు పోస్టులు కూడా భర్తీ కానున్నాయి.

– డా.సుధీర్, సూపరెండెంట్, ఏరియా ఆస్పత్రి, చీపురుపల్లి

పోలీస్ కస్టడీలో గంజాయి డాన్..!



కారులో ఉన్న గంజాయి ప్యాకెట్లు (ఫైల్)

- వివరాలు సేకరిస్తున్న పోలీసులు

రామభద్రపురం: గంజాయి అక్రమరవాణా చేస్తున్న వ్యక్తులపై సీఐ కె నారాయణరావు, ఎస్సై వి.ప్రసాదరావు ఉక్కుపాదం మోపారు. ఈ క్రమంలో గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతూ డాన్‌గా పేరున్న వ్యక్తి, కొట్టక్కి పోలీస్ చెక్ పోస్టు వద్ద కారులో అక్రమంగా గంజాయి తరలింపునకు కారకుడైన ప్రధాన నిందితుడు రామభద్రపురం పోలీసుల కస్టడీలో ఉన్నట్లు తెలిసింది. ఈ నిందితుడు గంజాయి అక్రమరవాణాలో పట్టుబడడంతో రామభద్రపురంతో పాటు ఎస్‌కోట, సాలూరు, కొత్తవలస, పాచిపెంట తదితర పోలీస్ స్టేషన్‌లలో కేసులు నమోదైనట్లు సమాచారం ఉంది.అయితే విశాఖ సెంట్రల్ జైల్‌లో ఉన్న ప్రధాన నిందితుడిని హుకుంపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించి అక్కడి నుంచి పీపీ వారెంట్‌పై రామభద్రపురం పోలీస్ కస్టడీకి తీసుకొచ్చి పోలీసులు విచారణ చేస్తున్నారు. ప్రథమ నిందితుడు అనంతగిరి చెందిన వ్యక్తిగా తెలిసింది. కొట్టక్కి వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టులో ఫిబ్రవరి 10 వతేదీ రాత్రి పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్న క్రమంలో వాహనాలు చెక్ చేస్తున్నారు. ఇంతలో వాహనాల వెనుకన ఒడిశా నుంచి అక్రమంగా ఒడిశా నుంచి 150 కిలోల గంజాయిని తరలిస్తున్న డస్టర్ కారు డ్రైవర్ కారును జాతీయ రహదారి పక్కన చిన్న రూట్‌లో తప్పించి స్పీడ్‌గా లాగించేశాడు. దీంతో అప్రమత్తమైన ఏఎస్సై అప్పారావు, పోలీస్ సిబ్బంది వెంటాడారు. సరిగ్గా కొట్టక్కి దుర్గమ్మ గుడి వద్దకు వెళ్లేసరికి సరిగా దారి కనిపించకపోవడంతో కారు వదిలేసి డ్రైవర్ పరారయ్యాడు. ఈ నేపథ్యంలో కారును, అందులో ఉన్న 150 కిలోల గంజాయి(74 ప్యాకెట్లు)ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో తొమ్మిది మంది నిందితులు ఉన్నట్లు విచారణలో తేలగా ఇప్పటి వరకు నలుగురిని అరెస్టు చేశారు.

సారా స్వాధీనం

పార్వతీపురం రూరల్: ఒడిశాకు చెందిన యువకుడు సారా ప్యాకెట్లను తరలిస్తుండగా పార్వతీపురం రైల్వేస్టేషన్‌లో అదుపులోకి తీసుకుని 150 సారా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు జీఆర్‌పీ ఎస్సై వి.బాలాజీరావు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు రైల్వేస్టేషన్‌లలో తనిఖీలు నిర్వహించగా అనుమానాస్పదంగా పారిపోతున్న ఒడిశాకు చెందిన టి. నరేంద్రను అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి రూ.4,500 విలువ చేసే సారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రాయగడ నుంచి రోడ్డు మార్గం ద్వారా వచ్చి పార్వతీపురం రైల్వే స్టేషన్ నుంచి రైళ్లల్లో విజయనగరం వరకు రవాణా చేసేందుకు ఎదురు చూస్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. గంజాయి, సారా, హాని కలిగించే మాదకద్రవ్యాలు రైలు మార్గం ద్వారా రవాణా జరగకుండా నిరోధించడానికి నిరంతరం గస్తీని ఏర్పాటు చేసినట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో హెచ్‌సీ రత్నకుమార్, తదితర సిబ్బంది ఉన్నారు.



సారా రవాణా చేస్తూ పట్టుబడిన వ్యక్తితో రైల్వే పోలీస్ అధికారులు

ప్రతి నెలా అనీమియా కమిటీ సమావేశం

- కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం టౌన్: జిల్లాలోని ప్రతి సచివాలయం పరిధిలో అనీమియా యాక్షన్ కమిటీ సమావేశాన్ని ఇకపై ప్రతి నెలా మొదటి బుధవారం నిర్వహించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ వైద్యాధికారులకు స్పష్టం చేశారు. కమిటీ సమావేశంలో తీసుకున్న చర్యలు, తద్వారా వచ్చిన ఫలితాలపై ఇక నుంచి సమీక్షిస్తానని తేల్చిచెప్పారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వైద్యాధికారులు, ఇతర జిల్లా అధికారులతో కలెక్టర్ బుధవారం సమీక్షించారు. జిల్లాలో కొత్తగా నిర్మించి అసంపూర్తిగా ఉన్న సీహెచ్‌సీలు, పీహెచ్‌సీలు, బీహెచ్‌పీయులను వినియోగంలోకి తీసుకురావాలని, అందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖాధికారులను ఆదేశించారు. ప్రధానంగా సీతానగరం, మామిడిపల్లి, శంబర పీహెచ్‌సీలో పనులను త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తేవాలని, మిగిలిన భవనాలను కూడా వీలైనంత త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. చిన్న చిన్న పనులు జరగక భవనాలు నిరుపయోగంగా ఉండడం సబబు కాదని, ప్రభుత్వం తప్పక నిధులు విడుదల చేస్తుందనే భరోసా కల్పించి ఆయా కాంట్రాక్టర్లతో పనులు త్వరగా చేయించాలని కలెక్టర్ సూచించారు.

జిల్లాలో మలేరియా కేసులు ఉండకూడదు

జిల్లాలో మలేరియా కేసులు ఉండడానికి వీల్లేదని, పోలియో, ఎయిడ్స్ మాదిరిగా ప్రజల్లో పెద్దఎత్తున అవగాహన కల్పించి మలేరియా నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం గ్రామ, మండల స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేసి ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. మండల స్థాయి కమిటీలు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి మలేరియా కేసులు లేకుండా చూడాలని పిలుపునిచ్చారు. అలాగే ప్రతి వారం తాగునీటి ట్యాంకులను పరిశీలించాలని, ప్రతి శుక్రవారం డ్రైడే కచ్చితంగా పాటించాలని కలెక్టర్ అన్నారు. రోగుల పట్ల వైద్యాధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.ఎస్.భాస్కరరావు, జిల్లా టీబీ నియంత్రణ అధికారి డా.ఎం.వినోద్ కుమార్, జిల్లా ప్రోగ్రాం అధికారి డా.టి.జగన్ మోహనరావు, డీసీహెచ్‌ఎస్ డా.బి.వాగ్దేవి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు డా.కె.విజయపార్వతి, డా.పద్మావతి, డీఆర్డీఏ పీడీ ఎం.సుధారాణి, ఏపీఈపీడీసీఎల్ ఎస్‌ఈ కె.చలపతిరావు, యూపీహెచ్‌సీ, పీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రుల వైద్యాధికారులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

26లోగా వాహనాలను రిలీజ్ చేసుకోవాలి

విజయనగరం టౌన్: రవాణాశాఖ తనిఖీ అధికారులు సీజ్ చేసిన వాహనాలకు నోటీసుల ద్వారా అపరాధరుసుం, ట్యాక్స్ బకాయిలు కట్టాలని ఇప్పటికే తెలియపర్చామని, వాటి యజమానులు, ఫైనాన్షియర్స్ స్పందించకపోవడంతో ఈ నెలలో వాహనాలను వేలం వేయనున్నామని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మణికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాహనాలు ఆర్‌టీఓ కార్యాలయం, ఆర్టీసీ డిపోలో ఉన్నాయన్నారు. ఈ నెల 26లోగా వాహనాలు రిలీజ్ చేసుకోవాలని, లేకుంటే ఎటువంటి సమాచారం లేకుండానే 27న వేలం వేయనున్నామని స్పష్టం చేశారు. వేలంలో వాహనాలు కొనుగోలు చేసేందుకు ఆసక్తి ఉన్నవారు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

హ్యాండ్‌లూమ్ టెక్నాలజీ కోర్సుల్లో ప్రవేశాలు

విజయనగరం అర్బన్: ప్రభుత్వ ఆధ్వర్యంలో వెంకటగిరిలోని శ్రీప్రగడ కోటయ్య మెమోరియల్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్‌లూమ్ టెక్నాలజీలో 3 ఏళ్ల డిప్లమో కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ ఓఎస్‌డీ ఎస్.గిరిధరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంస్థలో 53 సీట్లు, తమిళనాడులోని సేలంలో 12 సీట్లు, కర్నాటకలోని గడగ్‌లో 4 సీట్లకు ప్రవేశాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. పదో తరగతి తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులై ఈ ఏడాది జూలై 1 నాటికి 23 ఏళ్లలోపు వయస్సు ఉండాలని, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 25 సంవత్సరాల వరకు సడలింపు ఉందని తెలిపారు. ఇంటర్‌లో ఎంపీసీ, ఒకేషనల్ (టెక్స్‌టైల్స్), ఐటీఐ రెండు సంవత్సరాల కోర్సు ఉత్తీర్ణులైన వారు ఈ డిప్లమో కోర్సులో నేరుగా రెండవ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. అపేరల్, గార్మెంట్ మేకింగ్ టెక్నాలజీలో ఉచితంగా శిక్షణ ఇస్తారని తెలిపారు. దరఖాస్తులు, ఇతర వివరాల కోసం 'ఐఐహెచ్‌టీవీజీఆర్.కాం' వెబ్ సైట్ లేదా ఫోన్ 08625-295003, 9399936872, 9866169908, 9010243054 నంబర్లలో సంప్రదించవచ్చని సూచించారు.

పిడుగుపాటుకు ఎనిమిది గొర్రెల మృతి



పిడుగుపాటుకు మృతి చెందిన గొర్రెలు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని పెద్ద బూరాడపేట సమీపంలో సోమవారం మధ్యాహ్నం పిడుగులు బీభత్సం సృష్టించాయి. పిడుగుపాటుకు గ్రామానికి చెందిన డొప్ప త్రినాథ్ అనే రైతుకు చెందిన ఎనిమిది గొర్రెలు మృత్యువాత పడ్డాయి. సమీప పొలాల్లో గొర్రెలు మేత మేస్తుండగా ఆకస్మాత్తుగా పిడుగులతో కూడిన భారీ వర్షం కురిసింది. గొర్రెలు మేత మేస్తున్న సమయంలో పిడుగు పడడంతో ఎనిమిది గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. సుమారు రూ.80వేల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు త్రినాథ్ వాపోయాడు.

రైతును వెంటాడుతున్న దురదృష్టం

బూరాడపేటకు చెందిన రైతు డొప్ప త్రినాథ్‌ను దురదృష్టం వెంటాడుతోంది. సుమారు ఐదు నెలల క్రితం ఖరీఫ్ సీజన్‌లో కురిసిన వర్షానికి పొలంలో రాలిన ధాన్యం గింజలను మేయడంతో సుమారు 100కు పైగా గొర్రెలు మృత్యువాత పడ్డాయి. ధాన్యాన్ని జీర్ణించుకోలేకపోవడంతో గొర్రెలు మృతి చెందాయి. అప్పట్లో సుమారు రూ.10లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లింది. ఆ బాధ నుంచి తేరుకోకుండానే మళ్లీ పిడుగు రూపంలో ఎనిమిది గొర్రెలు మృతి చెందాయి. దీంతో బాధిత కుటుంబసభ్యులు తీవ్రంగా రోదించారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలంటూ కన్నీటి పర్యంతమయ్యారు.

ఈశ్వరమ్మ కంటకన్నీరు



మున్సిపల్ చైర్‌పర్సన్‌పై ఆగ్రహంతో ఊగిపోతున్న టీడీపీ పట్టణాధ్యక్షుడు నిమ్మాది చిట్టి

సాలూరు: మున్సిపాలిటీ మీ తాతగారిదా? మేము అధికార పార్టీలో ఉన్నాం అంటూ వయస్సు పైబడిన మహిళా మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మపై టీడీపీ పట్టణాధ్యక్షుడు నిమ్మాది చిట్టి ఆగ్రహంతో ఊగిపోయాడు, బుధవారం మున్సిపల్ కార్యాలయం వద్ద జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం పూర్తయిన తరువాత, మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఉన్న వార్డుల్లో నీటి సరఫరా కోసం నూతనంగా ఏర్పాటుచేసిన ట్రాక్టర్ వాటర్‌ట్యాంకర్‌ను చైర్‌పర్సన్, కౌన్సిలర్లు, అధికారులు ప్రారంభించారు. అక్కడి నుంచి ఆమె వస్తున్న సమయంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు నిమ్మాది చిట్టి పండగ పనులపై ఆరోపణలు చేస్తూ చైర్‌పర్సన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ మీ తాతగారిదా? మేము అధికార పార్టీలో ఉన్నాం అంటూ కనీసం ఆమె వయస్సుకు విలువ ఇవ్వకుండా విరుచుకుపడ్డాడు, టీడీపీ పట్టణాధ్యక్షుడితో పాటు పలువురు టీడీపీ నాయకులు ఆమెపై విరుచుకుపడడంతో శ్యామలాంబ తల్లి అంతా చూస్తుందని, ఎవరు తప్పు చేస్తే వారికి ఆ పాపం తగులుతుందని అంటూ చైర్పర్సన్ కంటనీరు పెట్టుకుంటూ చీర కొంగుతో తుడుచుకుంటూ నిస్సహాయత వ్యక్తం చేశారు. ఈ విషయం గుర్తించిన మున్సిపల్ వైస్ చైర్మన్ సంఘటనా స్థలానికి వచ్చి చైర్‌పర్సన్‌పై ఇలా మాట్లాడడం సమంజసం కాదని, పండగ పనుల నేపథ్యంలో అధికారులు అజెండాలో పెట్టిన అన్ని అంశాలను కౌన్సిల్‌లో ఆమోదించామని తామెప్పుడూ పండగ పనులకు ఎటువంటి అడ్డంకులు సృష్టించలేదని, సహకరించామన్నారు. టీడీపీ కూటమి పెద్దలు ఈ పండగకు ప్రత్యేక గ్రాంట్లు తెస్తామని హామీలు ఇచ్చి తేలేక, చివరకు అప్పు (రియింబర్స్‌మెంట్)గా వచ్చిన రూ.2 కోట్లతో పండగ ముందు పనులు చేయించుకోలేక వారి వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఇటువంటి రాజకీయాలకు దిగుతున్నారంటూ పలువురు పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు.

సుఖీభవ లేక.. దుఃఖం దిగమింగలేక..!

- డోలాయమానంలో అన్నదాతలు
- పథకం మంజూరుకు పూర్తికాని వెరిఫికేషన్
- మరో 15 రోజుల్లో ఖరీఫ్‌సాగు ప్రారంభం
- సాగుకు అప్పుకోసం రైతన్న వెతుకులాట



పూసపాటిరేగలో ఖరీఫ్‌సాగుకు సిద్ధమైన భూములు

పూసపాటిరేగ: రైతు సంక్షేమానికి పెద్దపీటవేస్తామని హామీలు గుప్పించిన కూటమి ప్రభుత్వం ఏడాదవుతున్నా ఇచ్చిన హామీని నెలబెట్టుకోవడంలో విఫలమైంది. కేంద్రం నుంచి మంజూరు కావాల్సిన పీఎం కిసాన్ నిధులు రైతుల అకౌంట్లలో ఇప్పటికే జమ కాగా, రాష్ట్రం నుంచి అందజేయాల్సిన అన్నదాత సుఖీభవ మంజూరుకు మీనమేషాలు లెక్కిస్తున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే అన్నదాత సుఖీభవ పథకంలో ప్రతి రైతుకు రూ.20 వేలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చి మాట నిలబెట్టుకోలేదు. రెవెన్యూ రికార్డుల ప్రకారం జిల్లాలో 4,85,158 మంది రైతులు ఉండగా ఇప్పటివరకు 1,42,222 మంది రైతుల రికార్డులు మాత్రమే తనిఖీ అయ్యాయి. ఇంకా 3,42,936 మంది రికార్డుల వెరిఫికేషన్ పూర్తి చేసిన తరువాత వ్యవసాయ అధికారి లాగిన్‌లో వెరిఫికేషన్ పూర్తి చేశాక తుది జాబితా సిద్ధం కానుంది. ఈనెల 20 వతేదీ లోపు రికార్డుల వెరిఫికేషన్ పూర్తి చేయడానికి గడువు ఇచ్చినట్లు సమాచారం. రబీ సీజన్ దాదాపు పూర్తవడంతోమరో 15 రోజుల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుంది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ముందుగానే వచ్చే అవకాశం ఉండడంతో ఇప్పటికే చెదురుమదురుగా వర్షాలు పడుతున్నాయి. ఈసమయానికి గతంలో రైతు భరోసా నిధులు రైతుల అకౌంట్లలో జమఅయ్యేవి. నేటి పరిస్థితి చూస్తే భిన్నంగా ఉంది. అన్నదాత సుఖీభవ కోసం జిల్లాలోని రైతులు ఎదురు చూస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో ఐదేళ్లు వ్యవసాయ సీజన్ ప్రారంభంలోనే మార్గదర్శకాలను అనుసరించి ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసి రైతులకు అవసరమైన పెట్టుబడి సాయం అకౌంట్లలో జమచేసి, ఎరువులు, విత్తనాలు రైతులకు రైతుభరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉండేవి. వీటితో పాటు వైఎస్సార్ పంటల బీమా, పంట రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీ రైతులకు అందించే వారని, నేడు ఆ పరిస్థితి లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సుఖీభవ సాయం తక్షణమే వేయాలి

ఖరీఫ్ సీజన్ మరో 15 రోజుల్లో ప్రారంభమయ్యే అవకాశం ఉండడంతో అన్నదాత సుఖీభవ సాయం తక్షణమే రైతుల అకౌంట్లలో జమచేయాలి. గతంలో మాదిరి సాగు పెట్టుబడికి సాయం అందజేయాలి. రైతుల ఆర్థిక ఇబ్బందులు దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం స్పందించాలి.

సీహెచ్.అప్పలనాయుడు, రైతు రెల్లివలస

సాయం ఎప్పుడు వేస్తారు..?

ప్రతి ఏడాది మే నెలలో వేయాల్సిన పెట్టుబడి సాయం రైతులకు ఎప్పుడు వేస్తారు? అధికారంలోకి వచ్చి 11 నెలలవుతున్నా రైతులను పట్టించుకునే పరిస్థితి కనిపించడం లేదు. పెట్టుబడి సాయం కోసం ఇంకా వెరిఫికేషన్లు పూర్తికాని పరిస్థితి. అధికారులు సర్వేలు పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదించి అన్నదాత సుఖీభవ ఖరీఫ్ సీజన్‌కు ముందే అందేవిధంగా చర్యలు తీసుకోవాలి.

కోరాడ వెంకటరమణ, రైతు పూసపాటిరేగ